

భూ సమస్యలపై
గ్రామాల్లోనే దరఖాస్తుల స్వీకరణ
- ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
7లో

ఐపీఎల్ బెట్టింగ్.. నలుగురి అరెస్ట్

జవాబుదారీతనం పెరగాలి
- సీనియర్ సంపాదకులు, కవి, రచయిత కె. శ్రీనివాస్
- మీడియా అంటే తెలియనివారిని జర్నలిస్టులుగా గుర్తించవద్దు
- టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరహత్ అలీ పిలుపు
7

భోజనం ఎలా ఉంది?

కడుపునిండా పెడుతున్నారా?

ఉదయం, మధ్యాహ్నం, రాత్రి ఏమేమి ఇస్తున్నారు?

సంగారెడ్డి జీజీహెచ్‌లో వైద్య ఆరోగ్యశాఖ జేడీ సుధీర తనిఖీ

డైట్ సరఫరాపై జాయింట్ డైరెక్టర్ సంతృప్తి

సంగారెడ్డి అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్, టాస్క్ ఫోర్స్ టీమ్ హెడ్ డాక్టర్ జి.సుధీర మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని ఆర్థోపెడిక్ మేల్, ఫిమేల్ వార్డులను సందర్శించారు. రోగులకు ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనంలో ఏమేమీ ఇస్తున్నారు? ఆహారం నాణ్యంగా ఉందా? కడుపు నిండా భోజనం పెడుతున్నారా? సమయానికి వడ్డిస్తున్నారా? అని రోగులను అడిగి తెలుసుకున్నారు. గుడ్డు, అరటి పండు ఇస్తున్నారా? మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? ఆహార విషయంలో ఇంకేమైనా సమస్యలున్నాయా అంటూ ఆరా తీశారు. డైట్ విషయమై ఆమె డ్యూటీ డాక్టర్లతోనూ మాట్లాడి సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు ఆహారం తయారుచేసే కిచెన్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డా.అనీల్‌కుమార్, ఆర్‌ఎంవోలు డా.వీరాంజనేయులు, డా.రవికుమార్, చీఫ్ డైటీషియన్ బాలస్వామి, డీఐవో డా.మనోహర్ రెడ్డి, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ సందీప్ తదితరులు ఉన్నారు.



సంగారెడ్డిలోని జీజీహెచ్‌లో రోగులతో మాట్లాడుతున్న వైద్య ఆరోగ్య శాఖ జేడీ సుధీర



కంది మండలం బ్యాతోలులో ఇసుక ఫిల్టర్లను కూల్చివేయిస్తున్న రెవెన్యూ అధికారులు

ఇసుక ఫిల్టర్లపై కొరడా

- కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ యంత్రాంగం చర్యలు
- నక్కవాగు పరీవాహక ప్రాంతంపై నిఘా
- ఫిల్టర్ల నిర్వాహకుల వివరాల సేకరణ
- పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- 'ఆంధ్రజ్యోతి' కథనాలకు స్పందన

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే 6: నక్కవాగుపై ఏర్పాటు చేసిన ఇసుక ఫిల్టర్లపై అధికారులు కొరడా ఝులిపించారు. ఎక్కడికక్కడ ఫిల్టర్లను కూల్చేశారు. సంగారెడ్డి, కంది మండలాల్లో ప్రవహిస్తున్న నక్కవాగు చుట్టూ అక్రమంగా ఇసుక ఫిల్టర్లను నిర్వహిస్తున్న విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో వరుస కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇక్కడ తయారుచేసిన నాసిరకం ఇసుకను సంగారెడ్డి, హైదరాబాద్ తోపాటు కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు రవాణా చేస్తున్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెవడంతో సంగారెడ్డి కలెక్టర్ స్పందించారు. కలెక్టర్ ఆదేశాలమేరకు సంగారెడ్డి ఆర్డీవో.. సంగారెడ్డి, కంది, పటాన్‌చెరు, హత్నూర మండలాల తహసీల్దార్లను అప్రమత్తం చేశారు. సోమవారం సాయంత్రం, మంగళవారం రోజంతా రెవెన్యూ సిబ్బంది నక్కవాగు పొడవునా గ్రామాల్లో నిఘా ఉంచారు. కంది మండలం బ్యాతోలు, చిద్రుప్ప, ఎర్దనూరు తదితర గ్రామాల్లో ఫిల్టర్లను జేసీబీలతో కూల్చివేశారు. దీంతో, నిత్యం ఇసుక లారీలు, ట్రాక్టర్లతో హడావుడిగా ఉండే ఇస్మాయిల్‌ఖాన్‌పేటలో నిర్మానుష్య వాతావరణం నెలకొంది.

రాణాకు అక్రమార్కుల చిట్టా

అక్రమంగా ఇసుక ఫిల్టర్లను నిర్వహిస్తున్న పలువురి పేర్లను రెవెన్యూ అధికారులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరిపై కేసులు నమోదు చేయాలని సూచించారు. సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి సూచనల మేరకు సంగారెడ్డి, కంది మండలాల తహసీల్దార్లు అప్రమత్తమై తమ సిబ్బందిని నక్కవాగు పరిసరాల్లోకి పంపించారు. ఇసుక ఫిల్టర్ల నిర్వాహకుల గురించి ఆరా తీసి వారి చిట్టాను పోలీసులకు అందించారు. వీరిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

తాత్కాలికమా.. శాశ్వతమా!

నక్కవాగు పరిసరాల్లో ఇసుక ఫిల్టర్లపై గతంలోనూ దాడులు జరిగాయి. రెవెన్యూ, పోలీస్ యంత్రాంగాలు ధ్వంసం చేసినప్పటికీ మరుసటి రోజే మళ్లీ ప్రారంభించడం సర్వసాధారణమైంది. అయితే ఈసారి మాత్రం పోలీస్‌స్టేషన్‌లో నిర్వాహకుల పేర్లతో కూడిన జాబితాలు అందజేశారు. మళ్లీ ఫిల్టర్లు ఏర్పాటుచేస్తే కఠిన చర్యలు సైతం తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. ప్రభుత్వం కూడా ఇసుక అమ్మకాలపై కఠినంగా వ్యవహరిస్తున్నది. నాసిరకం ఇసుకను బహిరంగ మార్కెట్‌లోకి రాకుండా నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు. పట్టువిడవకుండా నిరంతరం నక్కవాగుపై నిఘా ఉంచితేనే అక్రమ ఇసుక దందాకు చరమగీతం పాడొచ్చని.. లేదంటే మళ్లీ వాగుపై ఫిల్టర్లు వెలుస్తాయని స్థానికులు పేర్కొంటున్నారు.



ఎక్కడి పనులు
అక్కడే
- నిధులు రాక నిలిచిన అభివృద్ధి
- జిల్లా మంత్రులకు విన్నవించినా ఫలితం శూన్యం
7



అల్లాదుర్గంలో రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

అర్హులందరికీ
సంక్షేమ పథకాలు
- మెదక్ జిల్లా పరిషత్ సీఈవో ఎల్లయ్య
7

పోస్టాఫీస్‌లో
ఆధార్ సేవలు
- సిద్దిపేట జిల్లా కేంద్రంలోని పోస్టాఫీస్‌లో అందుబాటులోకి
- పట్టణ ప్రజలకు ఉపయోగం
7

ఉద్యాన పంటలకు ఊతం

- సాగు విస్తీర్ణం పెంచేందుకు రూ.9 కోట్లు కేటాయింపు
- పంట రకం ఆధారంగా కూరగాయల సాగుకు రాయితీ
- పండ్ల తోటల పెంపకానికి సాయం
- పూల సాగుపైనా దృష్టి

మెదక్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యమిస్తున్నాయి. మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ద్వారా పలు రాయితీలు ప్రకటించాయి. దాంతో రైతులకు సాగు పెట్టుబడులకు ప్రోత్సాహం అందుబాటులోకి వస్తుంది. 2025-26 సంవత్సరానికి రాయితీలకు జిల్లాకు రూ.9 కోట్లు కేటాయించారు. సాగుచేసే పంటల ఆధారంగా కేటాయింపులు జరిపారు. ఉద్యాన పంటలకు తొలిసారి ఇంత భారీగా బడ్జెట్ కేటాయింపు జరిగిందని అధికారులు చెబుతున్నారు. కూరగాయల పంటలైన టమాటా, వంకాయ, క్యాబేజీ, క్యాలీఫ్లవర్ నారు ఎకరాకు రూ.10వేలు నగదు, వంకాయ, కాకర, బీర పంటలకు అంటు కట్టిన మొక్కలను అందించనున్నారు.

పండ్ల తోటలకు ప్రాధాన్యం

పండ్ల తోటల సాగుకు ప్రతీ ఎకరాకు రాయితీ వివరాలు ఇలా ఉన్నాయి. డ్రాగన్‌ఫ్రూట్ రూ.65,000, ఆవకాడో 12,000, మామిడి తోటల పునరుద్ధరణ రూ.9,600, టిష్యూ కల్చర్ కింద అరటి సాగుకు రూ.16,800, బొప్పాయి



రూ.7,200, నిమ్మసాగుకు రూ.19200, జామ చెట్లకు రూ.19,200 చొప్పున రాయితీ ఇస్తున్నారు. పూల తోటల పెంపకానికి కూడా రాయితీలను ప్రకటించారు. గులాబీ, మల్లె తోటల పెంపకానికి రూ.8 వేలు, లిల్లీ తదితన దుంప పువ్వుల సాగునకు రూ.16వేలు, మల్చింగ్ విధానంలో పండ్లు, కూరగాయలు, పూల సాగుకు రూ.8 చొప్పున బడ్జెట్ కేటాయించారు. పన్నెండు సంవత్సరాల పాటు శాశ్వత పందిరి సాగుచేసే రైతులకు అర్ధ ఎకరాకు రూ.50 వేలు ఇవ్వనున్నారు. అంతేకాక తేనెటీగల పెంపకానికి 700 బాక్సులకు ఒక్కోదానికి రూ.2,400, తేనె తీసే పరికరానికి రూ.8వేలు, ప్యాకింగ్, గ్రేడింగ్ షెడ్డు కోసం నాలుగు యూనిట్లకు ఒక్కొక్కరికి రూ.2 లక్షలు రాయితీ ఇస్తున్నారు. మామిడి, అరటిపండ్ల సంచులకు 12.5 ఎకరాల్లో, ఎకరాకు రూ.10 వేల చొప్పున ఇస్తారు.

బిందు సేద్యానికి సబ్సిడీ

జిల్లావ్యాప్తంగా బిందు సేద్యానికి స్ప్రింక్లర్లను ఇస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీ, బీసీ, సన్నకారు, చిన్నకారు రైతులకు 90 శాతం, ఇతరులకు 80 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. ఫార్మ్‌పాండ్స్ నిర్మాణానికి రూ.75 వేలే రాయితీ ఇవ్వనున్నారు. ప్లాస్టిక్ మల్చింగ్ 85 ఎకరాల విస్తీర్ణానికి 50 శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. పొలం గట్లపై వెదురు సాగుకు 50 శాతం రాయితీపై మొక్కకు రూ.90ల చొప్పున ఎకరాకు 130 మొక్కలకు రాయితీ డబ్బును రైతుల ఖాతాల్లో జమ చేస్తామని ఉద్యానశాఖ అధికారులు తెలిపారు. ఈ సంవత్సరానికి జిల్లాకు 1,500 మొక్కలను కేటాయించారు.

రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యాన పంటల సాగురైతులకు అందజేస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి. ఆసక్తి కలిగిన రైతులు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉన్న ఉద్యానవనశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. మెదక్, హవేళిఘనపూర్, రామాయంపేట, నిజాంపేట్, నార్సింగ్, చేగుంట, తూప్రాన్ మండలాలకు సంబంధించి ఉద్యానవన అధికారి రచనను 8977714423 నంబర్‌లో సంప్రదించాలి. నర్సాపూర్, కౌడిపల్లి, కొల్చారం, చిన్నశంకరంపేట, వెల్దుర్తి, మాసాయిపేట, శివంపేట, మనోహరాబాద్, చిలప్‌చేడ్, పాపన్నపేట, టేక్మాల్, అల్లాదుర్గం, రేగోడ్, పెద్దశంకరంపేట మండలాల రైతులు ఉద్యానవన అధికారి సంతోష్ కుమార్‌ను 8977771422 నంబర్‌లో సంప్రదించవచ్చు.

-ప్రతాప్‌సింగ్, మెదక్ జిల్లా హార్టికల్చర్ అధికారి



రజాక్‌పల్లి రేషన్ షాపులో పంపిణీ చేసిన దొడ్డు బియ్యం

రేషన్ పంపిణీలో నయా మోసం

- సన్న బియ్యానికి బదులు దొడ్డు రకం పంపిణీ

నిజాంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం సరఫరాలో డీలర్లు నయా మోసానికి దిగుతున్నారు. మొన్నటి దాకా బ్లాక్ మార్కెట్లో దండుకున్న డీలర్లు ఇప్పుడు సన్న బియ్యంలో దొడ్డు బియ్యాన్ని కలుపుతున్నారు. సంచుల్లో సన్నబియ్యం కనిపించేలా ఉన్నప్పటికీ కింద మాత్రం దొడ్డి బియ్యం ఉంటున్నాయి. ఈ కొత్త రకం మోసం నిజాంపేట మండల పరిధిలోని రజాక్‌పల్లిలో వెలుగు చూసింది. మంగళవారం సాయంత్రం పలువురు లబ్ధిదారులు రేషన్ షాపుకు వెళ్లి బియ్యాన్ని తీసుకోగా దొడ్డు రకం కనిపించాయి. ఇదేమిటని ప్రశ్నించిన లబ్ధిదారులకు సివిల్ సప్లై నుంచి వచ్చిన బియ్యాన్నే ఇస్తున్నామంటూ సమాధానమిచ్చారు.

గ్రామాల్లో తాగునీటి ఎద్దడి

తలెత్తకుండా జాగ్రత్తగా ఉండాలి

- క్షేత్రస్థాయి అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- కంగ్టి మండలంలో వలె అన్ని మండలాల్లోనూ వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకోవాలి
- టెలీ కాన్ఫరెన్స్‌లో డీపీవో సాయిబాబా



టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న డీపీవో సాయిబాబా

సంగారెడ్డి టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఏ గ్రామంలోనూ తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి జిల్లా పంచాయతీ అధికారి టి. సాయిబాబా సూచించారు. కలెక్టరేట్‌లోని డీపీవో కార్యాలయం నుంచి జిల్లాలోని డీఎల్‌పీవోలు, ఎంపీవోలు, పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా తాగునీటి సమస్యపై సమీక్షించారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలు, డీఎల్‌పీవోలు అప్రమత్తంగా ఉండి తాగునీటి సరఫరాపై దృష్టిసారించాలన్నారు. కంగ్టి మండలంలో ప్రత్యేకంగా ఆయా శాఖల అధికారుల ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేసుకొని తాగునీటి ఎద్దడి ఏర్పడకుండా సమన్వయంతో పని చేస్తున్నారని అభినందించారు. కంగ్టి మండల అధికారులు చేపట్టిన కార్యక్రమాన్ని స్ఫూర్తిగా తీసుకొని అన్ని మండలాల్లో పంచాయతీ కార్యదర్శులు ఎంపీవోలు, డీఎల్‌పీవోలు, ఆర్‌డబ్ల్యుఎస్, మిషన్ భగీరథ శాఖల అధికారులతో వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసుకొని ఎక్కడ నీటి సమస్య ఏర్పడినా సమాచారం తెలుసుకొని పరిష్కరించాలని సూచించారు. ఎక్కడైనా బోరు మోటర్లు, పైపులైన్‌లు లీకేజీ అయితే, పని చేయకుంటే తక్షణమే మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. వాటర్ ట్యాంకులను శుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. మూగ జీవాలకు నీటి సమస్యను తలెత్తకుండా గ్రామాల్లో నీటి తొట్లలో నీరు నిల్వ ఉండేలా చూడాలన్నారు. ఎక్కడైనా తీవ్రమైన నీటి సమస్య తలెత్తితే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని డీపీవో సాయిబాబా సూచించారు.

సబ్ రిజిస్ట్రార్‌పై దాడి హేయమైన చర్య
నల్లబ్యాడ్జీలతో సంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ ఉద్యోగుల నిరసన
8లో

తల్లి ఒడి.. అంగన్‌వాడీ బడితో మేలు

- పిల్లలను సత్ప్రవర్తన గల వారిగా తీర్చిదిద్దాలి
- మనోహరాబాద్‌లో చిన్నారుల గ్రాడ్యుయేషన్‌లో స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క

మనోహరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): పిల్లలను మానసిక పరివర్తన, నైతిక విలువలతో సత్ప్రవర్తన కల వారిగా తీర్చిదిద్దాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. అమ్మ ఒడి తర్వాత అంగన్‌వాడీ బడి పిల్లలకు ఎంతో మేలని చెప్పారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో నర్సాపూర్ సీడీపీవో ఆధ్వర్యంలో ఐసీడీఎస్ అధికారులు ఏర్పాటు చేసిన అంగన్వాడీ స్కూల్ పిల్లల గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడుతూ.. దేశ భవిష్యత్తు పిల్లల చేతుల్లో దాగి ఉందన్నారు. పిల్లలకు అవసరమైన పోషకాహారం అందించే



చిన్నారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న మంత్రి సీతక్క

అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పిల్లలకు సృజనాత్మకతతో కూడిన సంస్కారం, చదువు అలవడుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలను కార్పొరేట్ ప్రీ స్కూళ్లలో చేర్చి.. తమ శ్రమతో సంపాదించిన సొమ్ము ఖర్చు చేసుకోవద్దని మంత్రి సీతక్క హితవు చెప్పారు. కార్పొరేట్ ప్రీస్కూళ్లకు దీటుగా అంగన్‌వాడీల ద్వారా చిన్నారులకు చదువు చెప్పించడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఆడుతూ పాడుతూ విద్యాబోధన చేయడం వల్ల పిల్లల్లో బాహ్య సౌందర్యంతో అంతర్ సౌందర్యం పెంపొందించడం గొప్ప విశేషమని ఆమె పేర్కొన్నారు. మొక్కై వంగనిది మానై వంగునా అనే సామెతను దృష్టిలో పెట్టుకుని చిన్నారులకు క్రమశిక్షణతో ఉన్నత విలువలు గల విద్యాబోధన చేయాలన్నారు. టెక్నిప్ ఎఫ్ఎంసీ ఇండియా అనే సంస్థ సహకారంతో విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు, మెమొంటోలు అందజేశారు. మంత్రి సీతక్కకు తొలుత విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయులు ఏర్పాటుచేసిన స్టాళ్లు, చార్టర్లను పరిశీలించారు.



మోడల్‌గా ఉస్మాన్‌నగర్

జంట రిజర్వాయర్లు

- స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీతో వాల్వ్‌ల నిర్వహణ
- సోలార్ పవర్‌తో లైట్లు, డ్రిప్ పద్ధతిలో గార్డెనింగ్ నిర్వహణ
- ఓఆర్ఆర్ ప్రాజెక్టు ఫేజ్-2లో పూర్తయిన పనులను పరిశీలించిన ఎండీ

హైదరాబాద్ సిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి): ఉస్మాన్‌నగర్‌లో నిర్మిస్తున్న 4 ఎంఎల్, 2 ఎంఎల్ సామర్థ్యం కలిగిన జంట రిజర్వాయర్లను మోడల్‌గా తీర్చిదిద్దుతున్నారు. పటాన్‌చెరు నియోజకవర్గంలోని తెల్లాపూర్ మున్సిపాలిటీ ప్రజలకు తాగునీటిని ఈ రెండు రిజర్వాయర్ల నుంచే అందించనున్నారు. రూ.30 కోట్లతో నిర్మిస్తున్న ఈ రెండు రిజర్వాయర్లు అందుబాటులోకి వస్తే.. దాదాపు లక్ష మంది జనాభాకు శుద్ధి చేసిన తాగు నీరు అందనుంది. ప్రస్తుతం 55 బల్క్ కనెక్షన్లు రానుండగా.. అందుకోసం ఇప్పటికే 22 కిలోమీటర్ల డిస్ట్రిబ్యూషన్ లైన్లను నిర్మించారు. పనులు దాదాపుగా పూర్తి కావడంతో ట్రయల్ రన్ కూడా విజయవంతంగా నిర్వహించారు. అయితే ఈ రిజర్వాయర్ల నుంచి సరఫరా చేస్తున్న ప్రతీ చుక్కనూ లెక్క కట్టేలాగా ప్రయోగాత్మకంగా ఫ్లో మీటర్‌ను పెడుతున్నారు. ఈ జంట రిజర్వాయర్ల పరిధిలో ప్రయోగాత్మకంగా డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్‌పై స్మార్ట్ వాల్వ్ టెక్నాలజీతో లైన్‌మెన్లు క్షేత్రస్థాయిలో తిరగాల్సిన అవసరం లేకుండానే.. మొబైల్ యాప్‌తో వాల్వులను నిర్వహించే విధంగా స్మార్ట్ వాల్వ్ ఏర్పాటు చేయనున్నారు. ఇంటర్ నెట్ ఆధారిత కమ్యూనికేషన్‌తో ఆపరేట్ చేస్తారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ విధానం ఇప్పటివరకు సనత్‌నగర్‌లో పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేశారు. అలాగే రిజర్వాయర్ల నీటి మట్టం.. క్లోరిన్ శాతం తదితర వివరాలను వాటర్‌బోర్డు ప్రధాన కార్యాలయానికి అనుసంధానం చేసిన డాష్ బోర్డుకి అందేవిధంగా చర్యలు తీసుకోనున్నారు. ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలో విస్తరించిన ప్రాంతాలకు తాగునీటి సరఫరా చేసేందుకు వాటర్‌బోర్డు చేపట్టిన ఓఆర్ఆర్ ప్రాజెక్టు ఫేజ్-2లో పటాన్ చెరు నియోజకవర్గంలోని ఉస్మాన్‌నగర్‌లో నిర్మిస్తున్న 4ఎంఎల్, 2ఎంఎల్ సామర్థ్యం కలిగిన జంట రిజర్వాయర్లను ఎండీ అశోక్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. ప్రారంభానికి సిద్ధం చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

ముదిరిన ఎండలు.. మూగజీవాలకు తిప్పలు

● వేసవి తాపానికి అల్లాడుతున్న పశువులు



ఎండ వేడిని తట్టుకోలేక మురుగు నీటిలో, పొదల చాటున నిల్చున్న పశువులు

కోహీర్, మే 6(ఆంధ్రజ్యోతి): ఎండల తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు చల్లదనం కోసం కూలర్లు, ఏసీలు, ఫ్యాన్లు వినియోగిస్తున్నారు. మరి జనాల పరిస్థితి ఇలా ఉంటే నోరు లేని మూగజీవాల పరిస్థితి దయనీయంగా మారింది. ఉష్ణోగ్రతలు పెరిగి గాలిలో తేమ తగ్గినప్పుడు పశువులు వడదెబ్బకు గురయ్యే ప్రమాదం ఉంది. గాలి ప్రసరణ సరిగా లేకపోవడం షెడ్లలో ఎక్కువ సంఖ్యలో పశువులు ఉండడం నీటి సౌకర్యం అందుబాటులో లేకపోవడం వంటి కారణంగా వడదెబ్బకు గురవుతున్నాయి.

ముందస్తు చర్యలతో రక్షణ

పెరుగుతున్న వేసవి తాపానికి పశువులు గొర్రెలు కోళ్లు కకల వికలమవుతున్నాయి. ఏప్రిల్ 20 నుంచి ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల కంటే పైనే నమోదు కావడంతో పలు గ్రామాల్లోని పశువులు కోళ్లు గొర్రెలు వడదెబ్బకు గురవుతున్నాయి. వేసవిలో రోజు వారి మేత అందించే సమయాన్ని మార్చుకోవాలి. ఉదయం ఐదు గంటల నుంచి పది గంటల వరకు మేతకు వదలాలి. శరీరంపై ఉండే వెంట్రుకలను కట్ చేస్తుండాలి. వేసవిలో సరైన నీరు ఆహారం ఇవ్వని పక్షంలో పాడిపశువుల్లో పాల దిగుబడి తగ్గే అవకాశం ఉంటుంది. పశువుల పాకలను శుభ్రంగా ఉంచాలి. కొట్టాలపై, కోళ్ల షెడ్లపై గోనే సంచులను ఏర్పాటు చేయాలి.

పశువులకు వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



వేసవిలో పశువులను పగటిపూట మేతకు బయటకు వదలకూడదు. తాగు నీరు అన్నివేళల్లో అందుబాటులో ఉంచాలి. పశువులను రోజుకు రెండుసార్లు చల్లని నీళ్లతో కడగాలి. వెళ్తురు ప్రసారమయ్యేలా ఎత్తయిన కొటాన్ని గడ్డితో నిర్మించాలి. లేదా రేకులు ఉంటే పైన వరిగడ్డి పరచాలి. ఉప్పు కలిపిన కుడితి అందించాలి పచ్చని పశుగ్రాసం అందుబాటులో ఉంచాలి. వడదెబ్బకు గురైన పశువులను వెంటనే చల్లని గాలి వీచే చోటుకు చేర్చాలి. వెంటనే పశువైద్య సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. వైద్యుల పర్యవేక్షణలో శరీర ఉష్ణోగ్రతలు తగ్గించడానికి ఇంజక్షన్లు వేయించాలి. సంచార పశువైద్యశాల 1922 సేవలు వినియోగించుకోవాలి.

వసంతకుమారి (జిల్లా పశువైద్యాధికారి), సంగారెడ్డి

10వ తరగతి పాసైన సంబరం మిగల్చకుండానే.. అనంతలోకాలకు



ఉల్లెంగుల శివాజీ (ఫైల్)

హుస్నాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఆరు రోజుల క్రితం విడుదలైన 10వ తరగతి పరీక్షల్లో మంచి మార్కులతో పాసైన తమ కుమారుడిని చూసి తబ్బిబ్బయ్యారు. తమ కుమారుడు పాసయ్యాడని చుట్టాలకు, పక్కాలకు చెప్పుకుంటూ సంబరపడి పోయారు. కానీ ఆ సంతోషం కొద్ది రోజులు కూడా మిగల్చకుండానే తమ ఒక్కగానొక్క కుమారుడిని మృత్యువు కరెంట్ రూపంలో కానరానిలోకాలకు తీసుకెళ్లి ఆ తల్లిదండ్రులకు పుత్రశోకాన్ని మిగిల్చింది. ఈ సంఘటన సోమవారం అర్ధరాత్రి హనుమాన్ నగర్‌లో జరిగింది. హనుమాన్ నగర్‌కు చెందిన ఉల్లెంగుల కొమరయ్య, స్వరూపల కుమారుడు ఉల్లెంగుల శివాజీ (15) పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో ఉత్తీర్ణుడయ్యాడు. సోమవారం రాత్రి కురిసిన , వర్షానికి, గాలులకి కొమరయ్య ఇంటి బాత్రూమ్‌పై కరెంట్ తీగపడింది. ఇది గమనించకుండా శివాజీ బాత్రూమ్ డోర్ ముట్టుకోగా కరెంట్ షాక్ వచ్చింది. దీంతో కేకలు వేయడంతో వెళ్లి రక్షించబోయే సరికి మృతి చెందాడని శివాజీ సోదరి తెలిపింది. ఈ సంఘటనపై కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

కొండపాక, మే 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైను మరమ్మతు చేస్తుండగా ప్రమాదవశాత్తు కార్మికుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం వెలికట్ట శివారులో రాజీవ్ రహదారి నుంచి జప్తినాచారం వెళ్లే రహదారి పై జరిగింది. వివరాల్లోకి వెళితే.. జగదేవపూర్ మండలం దౌల్తాపూర్ గ్రామానికి చెందిన అన్నమైన బాబు(23) అనే వ్యక్తి సీతంపల్లి గ్రామానికి చెందిన విద్యుత్ కాంట్రాక్టర్ నరసింహారెడ్డి దగ్గర లేబర్‌గా పని చేసేవాడు. ఆదివారం గాలి దుమారానికి విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. కొత్త స్తంభాలు పాతి మధ్యాహ్నం విద్యుత్తు కనెక్షన్ ఇవ్వడానికి ప్రయత్నం చేస్తుండగా విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితికి వెళ్ళిపోయాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

కారు ఢీకొని మహిళ మృతి

● ఇద్దరికి తీవ్రగాయాలు

చేగుంట, మే 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు దాటుతున్న ముగ్గురిపైకి కారు దూసుకెళ్లడంతో ఓ మహిళ అక్కడికక్కడే మృతిచెందగా, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం రాత్రి చేగుంట మండలం పరిధిలోని వల్లభాపూర్ గ్రామ శివారులోని 44వ జాతీయ రహదారి పై జరిగింది. నార్సింగ్ ఎస్సై అహ్మద్ మొనుద్దీన్ తెలిపిన వివరాల ప్రకారం.. నార్సింగ్ మండలం వల్లభహాపూర్ గ్రామానికి చెందిన పోచమ్మల మారెవ్వ (50) అక్కడికక్కడే మృతి చెందారు. రామయ్య, రుక్మాపూర్ గ్రామానికి చెందిన దశరథంకు తీవ్రమైన గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఆసుపత్రి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

విద్యుదాఘాతంతో మేకలు మృతి

● సుమారు రూ.70 వేల వరకు నష్టం

తొగుట, మే 6 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతానికి గురై మూడు మేకలు మృతి చెందాయి. ఈ సంఘటన మంగళవారం లింగంపేట పటేల్ చెరువు సమీపంలో జరిగింది. బాధితుడు కథనం ప్రకారం... తొగుట గ్రామానికి చెందిన ముచర్ల రమేష్ మంగళవారం మేకలను తోలుకొని లింగంపేట గ్రామ శివారులోని పర్యలిచెరువు ప్రాంతానికి వెళ్లాడు. ఈ క్రమంలో రెండు రోజులుగా ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో విద్యుత్ స్తంభం నేల వాలింది. అది చూడకుండా మేకల కాపరి అటు వైపు వెళ్లడంతో విద్యుదాఘాతానికి మూడు మేకలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.70 వేల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఈ ప్రమాదం చోటుచేసుకుందని గ్రామస్థులు ఆరోపించారు. ప్రభుత్వం వెంటనే బాధిత కుటుంబానికి నష్ట పరిహారం చెల్లించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

హుస్నాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన గొర్ల శ్రీనివాస్ (40) అనే వ్యక్తి మంగళవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియలేదు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు చెప్పారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

● రూ.7వేలు, 7మొబైల్‌ఫోన్లు స్వాధీనం

జహీరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి): హోతి(కే) శివారులోగల ఇటుకబట్టీల సమీపంలో పేకాటస్థావరంపై దాడులు చేసి రూ. 7,140లు, 7మొబైల్‌ఫోన్లు, పేకాట కార్డులు స్వాధీనం చేసుకోవడమైందని ట్రైనీ ఎస్సై సుజిత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం హోతి(కే) శివారులో పేకాట ఆడుతున్నట్లు తెలిసిందన్నారు. దీంతో పేకాటస్థావరంపై దాడులుచేసి ఏడుగురు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వివరించారు.

మైలాన్‌లో అగ్ని ప్రమాదం



మైలాన్‌లో మంటలు వస్తున్న దృశ్యం

ఐడీఏబొల్లారం మే 6 (ఆంధ్రజ్యోతి): ఐడీ ఏబొల్లారం పారిశ్రామికవాడ మైలాన్ రసాయన పరిశ్రమలో మంగళవారం తెల్లవారుజామున ఆర్అండ్‌డీ విభాగంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికారులు మంటలను అదుపులోకి తెచ్చారు. షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు వ్యాపించి ఉంటాయని పరిశ్రమ ప్రతినిధులు చెప్పారు. ఎటువంటి ఫిర్యాదు రానందున కేసు నమోదు కాలేదని సీఐ రవీందర్‌రెడ్డి చెప్పారు.

'ఆదివాసులపై దాడులు, హత్యాకాండను ఆపండి'

చేగుంట, ఏప్రిల్ 6 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఆదివాసులపై దాడులు వెంటనే ఆపివేసి మావోయిస్టులతో చర్చలు జరపాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డప్పు శివరాజ్‌మాదిగ డిమాండ్ చేశారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● మెదక్ జిల్లా పరిషత్ సీఈవో ఎల్లయ్య



పెద్దశంకరంపేట : రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఎల్లయ్య

రేగోడు/అల్లాదుర్గం/పెద్దశంకరంపేట, మే6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందిస్తామని మెదక్ జడ్పీ సీఈవో ఎల్లయ్య అన్నారు. మంగళవారం రేగోడు, అల్లాదుర్గం, పెద్దశంకరంపేట మండల పరిషత్ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువవికాసం దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. నిరుద్యోగ యువతి, యువకులకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రాజీవ్ యువ వికాసం పథకం దరఖాస్తుల విధివిధానాలను త్వరతగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీవోలు చంద్రశేఖర్, విఠల్ రెడ్డి, ఎస్సీ కార్పొరేషన్ ప్రతినిధి యాదయ్య, మండల పరిషత్ సూపరింటెండెంట్లు రమేష్, షాకీర్అలీ, సీనియర్ అసిస్టెంట్లు రవీందర్, కాశీరాం, జూనియర్ అసిస్టెంట్లు కేశయ్య, సజ్జద్ అలీ, సిబ్బంది తదితరులు ఉన్నారు. కాగా రేగోడులో జడ్పీ సీఈవో ఆకస్మిక తనిఖీలో ఎంపీడీవో అందుబాటులో లేరు.

● మునిపల్లి, మే6 (ఆంధ్రజ్యోతి) : మునిపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని సంగారెడ్డి జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో స్వప్న ఆకస్మికంగా తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట జిల్లా పరిషత్ సూపరింటెండెంట్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీవో డాక్టర్ హరినందన్ రావు, కార్యాలయ సూపరింటెండెంట్ రామలింగం, సీనియర్ అసిస్టెంట్ చంద్రకళ, జూనియర్ అసిస్టెంట్ శ్రీనివాస తదితరులు ఉన్నారు.

ఎక్కడి పనులు అక్కడే

● నిధులు రాక నిలిచిన అభివృద్ధి
● జిల్లా మంత్రులకు విన్నవించినా ఫలితం శూన్యం



నిలిచిపోయిన సమీకృత మార్కెట్ భవన పనులు



అసంపూర్తిగా నిలిచిన ఆధునిక దోభీ ఘాట్ భవనం

నర్సాపూర్, మే 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ కేంద్రమైన నర్సాపూర్ పట్టణంలో నిధులు రాక పలు లభివృద్ధి పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు అతి సమీపంలో ఉన్న నర్సాపూర్ పట్టణం ప్రగతి దిశగా పరుగులు పెట్టాల్సి ఉండగా.. ప్రగతి పనులు ఎక్కడికక్కడే పడకేశాయి. గతంలో మంజూరైన కోట్ల రూపాయలు కూడా విడుదల కాకపోవడంతో పలు భవనాల నిర్మాణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా ఇక్కడ బీఆర్ఎస్‌కు చెందిన సునీతారెడ్డి ఎమ్మెల్యేగా గెలిచారు. అందుకే ఈ నియోజకవర్గాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఆగిపోయిన అభివృద్ధి పనులు పూర్తిచేయాలని జిల్లా మంత్రి దామోదర్‌రాజనర్సింహ, ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖలకు విన్నవించినా ఫలితం లేదని వారు విమర్శిస్తున్నారు.

అసంపూర్తి దశలోనే సమీకృత మార్కెట్

నర్సాపూర్ పట్టణంలో కూరగాయలు, మాంసం, చేపల విక్రయాలు అన్ని ఒకే చోట ప్రజలకు సౌకర్యవంతంగా అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో రూ.ఈ కోట్లతో నిర్మిస్తున్న సమీకృత మార్కెట్ అసంపూర్తి దశలోనే వదిలేశారు. గత ప్రభుత్వంలో మంజూరైన నిధులను ప్రస్తుత కాంగ్రెస్ నిలుపడంతోపాటు చేసిన పనులు బిల్లులు రాకపోవడంతో పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి.

మున్సిపల్ భవనం..

నర్సాపూర్ మున్సిపల్ నూతన భవనం రూ.5కోట్లతో నిర్మిస్తున్నారు. నిధులు రాక తుది దశలో పనులు ఆగిపోయాయి. చేసిన పనులకూ బిల్లులు రావడం లేదని సదురు కాంట్రాక్టర్ పనులు నిలిపివేశాడు. దీంతో ప్రస్తుతం మున్సిపల్ కార్యాలయం అరకొర సౌకర్యాలతో మహిళ మండలి భవనంలో ఇరుకు గదుల మధ్య సాగుతుంది. ఇక ఆధునిక దోభీఘాట్ పనులు రెండుకోట్లతో దాదాపు చివరిదశలో ఉండి నిధులు రాక నిలిచిపోయాయి. అదేవిధంగా కోటి నిధులతో చేపట్టిన గౌడ సామాజిక భవనం, సునీతారెడ్డి కాలనీలో మహిళమండలి తదితర భవనాలన్నీ నిధులు విడుదల కాకపోవడంతో మధ్యలో నిలిచిపోయాయి.

సొంత భవనాలు కరువు

డివిజన్ కేంద్రంగా ఉన్న నర్సాపూర్‌లో ప్రధాన ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు కూడా లేవు. అందరికి భూములు చూపే ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాలకూ సొంత భవనాలు లేకపోవడం గమనార్హం. ఆర్డీవో కార్యాలయం పశుసంవర్థక శాఖకు చెందిన భవనంలో, తహసీల్దార్ కార్యాలయం నీటిపారుదల శాఖ అతిథిగృహంలో కొనసాగుతున్నాయి. ఇక ఎక్సైజ్ కార్యాలయం కూడా అతిథి గృహంలో, సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం అద్దె భవనంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. అలాగే పలు విద్యాలయాలు, వసతిగృహాలను సైతం సొంత భవనాలు లేక అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు.

మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు..



నర్సాపూర్‌లో నిలిచిపోయిన అభివృద్ధి పనులకు నిధులు కేటాయింపుతో పాటు ప్రభుత్వ కార్యాలయాలకు స్థలాలు కేటాయించాలని జిల్లా మంత్రి, ఇన్‌చార్జి మంత్రి, ఉన్నతధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేగా ఉన్నందున్నే ఈ నియోజకవర్గంపై చిన్నచూపు చూస్తున్నారు. నిధుల కోసం ప్రభుత్వంపై ఎప్పటికప్పుడు ఒత్తిడి తెస్తూ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు ప్రయత్నం చేస్తా.

-సునీతారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే

ఐపీఎల్ బెట్టింగ్.. నలుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న చేర్యాల సీఐ ఎల్ శ్రీను

చేర్యాల, మే 6 (ఆంధ్రజ్యోతి) : చేర్యాల పట్టణంలో ఐపీఎల్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న నలుగురిని అరెస్ట్ చేశారు. చేర్యాల సర్కిల్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ ఎల్ శ్రీను వివరాలను వెల్లడించారు. అక్కన్నపేట మండలం రామారం గ్రామానికి చెందిన కూరపాటి శివప్రసాద్, చేర్యాల పట్టణానికి చెందిన ముగ్గురి మైనర్లతోపాటు మరికొంతమంది కలిసి పట్టణ శివారులోని చెరువు సమీపంలో ఐపీఎల్ బెట్టింగ్‌కు పాల్పడుతున్నారన్న సమాచారంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, స్థానిక పోలీసులు దాడులు చేశారు. కొందరు పారిపోగా, పట్టుబడిన నలుగురిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. వీరివద్ద నుంచి రూ.76,400, నాలుగు మొబైల్ ఫోన్లు, మూడు మోటార్ సైకిళ్ల స్వాధీనం చేసుకుని కేసునమోదు చేశారు. ఈ సమావేశంలో ప్రొబేషనరీ ఎస్ఐ సమత, హెడ్‌కానిస్టేబుల్ శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.

రెట్టింపు డబ్బులంటూ మోసం

● రూ.1.74లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

దుబ్బాక, మే6(ఆంధ్రజ్యోతి): రెట్టింపు డబ్బులు ఇస్తామంటూ ఆశ చూపి ఓ వ్యక్తి నుంచి డబ్బులు కాజేసిన సంఘటన దుబ్బాక పట్టణంలో వెలుగు చూసింది. మంగళవారం దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం దుబ్బాక పట్టణానికి చెందిన వ్యాపారి మహ్మద్ సలాం ఫోన్‌కు అమిలీయా పేరుతో యాప్ లింక్ వచ్చింది. దానిపై క్లిక్ తెరిచి చూసిన అతడితో మీరు ఎన్ని డబ్బులు పంపిస్తే అంతకు రెట్టింపు డబ్బులు తిరిగి వస్తాయని సైబర్ నేరగాళ్ల నమ్మబలికారు. దీని నమ్మిన అతడు మొదట రూ.30 వేలు పంపగా, రూ.60 వేలు వచ్చాయి. అనంతరం రూ.60వేలు పంపంగా రూ.లక్షా 20వేలు వచ్చాయి. దీంతో మరింత డబ్బు సంపాదించాలనే ఆశతో అప్పటి వరకు వచ్చిన డబ్బులతోపాటు మరో రూ.1,74,999 అదనంగా పంపించాడు. ఈసారి తిరిగి డబ్బులు రాకపోవడంతో మోసపోయినట్లు గ్రహించిన అతడు 1930కు కాల్ చేసి ఫిర్యాదు చేశాడు. దుబ్బాక పోలీసులు విచారణ చేపట్టి ఆ సైబర్ నేరగాళ్ల నుంచి సుమారు రూ.7వేలు రికవరీ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపారు.

గ్రామాల్లోనే భూ సమస్యల దరఖాస్తుల స్వీకరణ

● మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



బండా పోతుగల్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్

చిలప్‌చెడ్, మే 6(ఆంధ్రజ్యోతి): గతంలో భూ సమస్యల పరిష్కారానికి తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ల కార్యాలయాలకు వెళ్లవలసి వచ్చేదని, నేడు భూ భారతి కార్యక్రమంలో భాగంగా రెవెన్యూ అధికారులే గ్రామాల్లోకి వచ్చి భూ సమస్యలు దరఖాస్తులను స్వీకరిస్తారని కలెక్టర్ రాహుల్‌రాజ్ పేర్కొన్నారు. మంగళవారం బండాపోతుగల్ గ్రామంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సుకు ఆయన హాజరై ఆర్డీవో మహిపాల్‌రెడ్డి, తహసీల్దార్ సహదేవ్‌తో కలిసి దరఖాస్తులు స్వీకరించి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటికే అన్ని మండలాల్లో భూ భారతి చట్టంపై అవగాహన కల్పించామన్నారు. జూన్ మొదటి వారంలో రెవెన్యూ గ్రామాల వారీగా సదస్సులను నిర్వహిస్తామన్నారు. అనంతరం మండలం లోని చిట్కుల్ గ్రామాన్ని సందర్శించారు. ఇందులో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే, తాగు నీటి ఎద్దడిని పరిశీలించారు.

ధాన్యం సేకరణ వేగవంతం చేయాలి

మనోహరాబాద్ మే 6 (ఆంధ్రజ్యోతి): ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం మనోహరాబాద్ మండలం దండుపల్లిలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి పరిశీలించారు. వివరాలను ప్యాక్స్ చెర్మన్ బాలకృష్ణ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్డీవో జయచ్రందరెడ్డి, డీఆర్వో ఇన్‌చార్జి రమేష్, వెంకటేష్, బాలగౌడ్ రైతులు పాల్గొన్నారు.

జవాబుదారీతనం పెరగాలి

● సీనియర్ సంపాదకులు, కవి, రచయిత కె. శ్రీనివాస్
● మీడియా అంటే తెలియనివారిని జర్నలిస్టులుగా గుర్తించవద్దు
● టీయూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరహత్ అలీ పిలుపు



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కె. శ్రీనివాస్

ములుగు, మే 6 (ఆంధ్రజ్యోతి): మీడియాలో భావ ప్రకటన స్వేచ్ఛతో పాటు జవాబుదారీతనం పెరగాలని సీనియర్ సంపాదకులు, కవి, రచయిత కె శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలో గజ్వేల్ ప్రెస్ క్లబ్ 25ఏళ్ల వేడుకల సందర్భంగా జర్నలిజం గతం-వర్తమాన-భవిష్యత్తు అనే అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో టీయూడబ్ల్యూజే(ఐజేయు) రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరాహత్ అలీతో కలిసి అయన హాజరయ్యారు. ఈ సందర్భంగా కె. శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రధాన, సోషల్ మీడియాల్లో జవాబుదారీతనం లేకపోవడంతో విచ్చలవిడితనం పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం సోషల్, డిజిటల్ మీడియా దారి తప్పకుండా ఉండాలంటే ప్రధాన మీడియా వాటికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. గతంలో ప్రింట్ జర్నలిజంలో వడపోత ప్రక్రియ ఉండేదని, రాజకీయ పార్టీలు విచక్షణ రహిత జర్నలిజాన్ని ప్రోత్సహించవద్దని కోరారు. సామాజిక స్పృహతో జనం పక్షాన నిలబడి పనిచేస్తున్న గజ్వేల్ ప్రెస్‌క్లబ్ జర్నలిస్టులను ఆయన అభినందించారు. జర్నలిజం పేరుతో కొన్ని అల్లరి మూకలు చేస్తున్న ఆగడాల కట్టడికి ప్రజలు, రాజకీయ నాయకులు కంకణబద్ధులు కావాలని టియుడబ్ల్యూజే(ఐజేయు) రాష్ట్ర అధ్యక్షుడు ఖాజా విరహత్ అలీ పిలుపునిచ్చారు. మీడియా అంటే తెలియనివారిని జర్నలిస్టులుగా గుర్తించవద్దన్నారు. కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రంగాచారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కృపాకర్ రెడ్డి. ఎల్లం, తాడెం నర్సింహులు, జగదీశ్వర్, డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ విజయ మోహన్, వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ ఏఎంసీ చైర్మన్ జహంగీర్, నాయకులు దేవేందర్‌రెడ్డి, రమేష్ రెడ్డి, కొట్టాల గణేష్, కొన్యాల బాల్‌రెడ్డి, ఎంపీడీవో స్వర్ణకుమారి, తహసీల్దార్ ఆరిఫా, విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, జర్నలిస్టులు సురేందర్, ఎల్లారెడ్డి, యాదగిరి, మధుసూదన్ రెడ్డి, కిరణ్, కడపల్ల నరసింహారెడ్డి, కడపల్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఎస్ఐపై దాడి

మద్దూరు, మే 6 (ఆంధ్రజ్యోతి): నాటుసారాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో దాడులు చేసేందుకు సిబ్బందితో కలిసి వెళ్లిన ఎక్సైజ్ ఎస్ఐపై మూడావత్ సంతోశ్ దాడికి పాల్పడ్డాడు. ఈ సంఘటన మంగళవారం ధూళిమిట్ట మండలం కొండాపూర్ పరిధిలోని చెలిమెతండాలో చోటుచేసుకుంది. మద్దూరు ఎస్ఐ షేక్ మహబూబ్ అలీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చెలిమతండాలో నాటుసారాయి విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు ఎక్సైజ్ ఎస్ఐ గుగులోతు సువర్ణ తమసిబ్బందితో కలిసి తండాకు వెళ్లారు. అక్కడ పీర్యా ఇంట్లో తనిఖీలు నిర్వహిస్తుండగా, పక్క ఇంట్లో ఉన్న మూడావత్ సంతోశ్ వారివద్దకు వచ్చి దుర్భాషలాడి గ్రానైట్ రాయి విసిరివేయడంతో ఎస్ఐ సువర్ణ ఎడమ మోచేతికి గాయమైందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహబూబ్ అలీ తెలిపారు.

రావి ఆకుపై అమ్మవారు



నారాయణఖేడ్, మే 6 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని హిందువులకు మరీ ముఖ్యంగా ఆర్యవైశ్యులకు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి అంటే ఎంతటి భక్తో ప్రత్యేకించి చెప్పాల్సిన పని లేదు. వారి కుల దైవమైన ఈ తల్లిని తలచుకోనిదే వారి జీవితం గడవదు. నేడు వాసవి మాత జయంతి సందర్భంగా సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్‌కు చెందిన లీఫ్ ఆర్టిస్టు శివకుమార్ రావి ఆకుపై అమ్మవారి చిత్రం, ఒక చేతిలో కమలం, మరో చేతిలో చిలుక చిత్రాలతో ప్రతి ఒక్కరికి కన్యకాపరమేశ్వరి మాత జయంతి శుభాకాంక్షలు తెలిపారు.

సీఐటీయూని గెలిపించండి

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు



సమావేశంలో మాట్లాడుతున్న చుక్కా రాములు

గజ్వేల్, మే 6 (ఆంధ్రజ్యోతి): రాణే బ్రేక్ లైనింగ్ లిమిటెడ్ పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సీఐటీయూను భారీ మెజార్టీతో గెలిపించాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ పిలుపునిచ్చారు. పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో భాగంగా మంగళవారం పరిశ్రమ గేటు ఎదుట యూనియన్ అధ్యక్షులు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఐటీయూ కార్మిక పక్షపాతి అని, కార్మికుల మెరుగైన జీవన ప్రమాణాల కోసం యజమాన్యలతో రాజీ లేని పోరాటాలు చేస్తుందన్నారు. గతంలో 10వేలకు పైగా వేతన ఒప్పందం చేసి కార్మికుల కుటుంబాలకు మెరుగైన మెడికల్ పాలసీని, జీపీఏను అమలు చేసి, కార్మికులకు ఎటువంటి నష్టం రాకుండా అనేక సంక్షేమ పథకాలు అమలు చేపిస్తూ కాపాడుకున్నదన్నారు. వివిధ రూపాల్లో కార్మికులు మరణించినప్పుడు వారి కుటుంబాలకు అండగా ఉండే విధంగా పథకాలు తయారుచేసి ఆదుకున్నామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, యూనియన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉప ప్రధాన కార్యదర్శి బండ్ల స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ దువ్వల భిక్షపతి, యూనియన్ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, రవికుమార్, మల్లయ్య, నర్సింహులు, రంగారెడ్డి, వి. వెంకట్రావు, ఏ. స్వామి, శ్రీనివాస్, సాజిద్, కృష్ణమూర్తి, కార్మికులు పాల్గొన్నారు.

పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు

● సద్వినియోగం చేసుకోవాలంటున్న పోస్టల్ అధికారులు



సిద్దిపేట కల్చరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : అధార్ ఆప్‌డేట్, పేరులో మార్పులు, ఫొటో ఐడెంటిటీ కోసం ఆధార్ సెంటర్ల వద్ద జనాలు భారీ క్యూలు కడుతున్నారు. కాగా, సిద్దిపేట జిల్లాకేంద్రంలోని పోస్టాఫీసులో కూడా ఆధార్ సేవలు అందిస్తున్నారు. ఇది చాలామందికి తెలియకపోవటంతో ఆ సేవలను సద్వినియోగం చేసుకోలేక పోతున్నారు. ఈ నేపథ్యంలో పోస్టాఫీస్‌లో అధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పోస్టల్ ఎస్పీ శ్రీహరి, ఏఎస్పీ నికేశ్ కుమార్, సిద్దిపేట హెడ్ పోస్ట్ మాస్టర్ శ్రీనివాస్ ప్రజలకు సూచిస్తున్నారు. సిద్దిపేట హెడ్ పోస్టాఫీస్‌లో ఏర్పాటు చేసిన అధార్ సెంటర్‌లో కొత్తగా అధార్ కార్డు, మార్పులు, చేర్పులు, ఫొటో ఐడెంటిటీ, బయోమెట్రిక్ ఆప్‌డేట్ సేవలను పొందవచ్చని తెలిపారు. ఆధార్ నమోదు కోసం, మార్పుల కోసం వచ్చే వారికోసం పలు సూచనలు చేశారు.

ఆధార్ మార్పులకు కావాల్సిన పత్రాలివే..

● కొత్తగా ఆధార్ నమోదు చేసుకోవాల్సిన వారు ఒరిజినల్ బర్త్ సర్టిఫికెట్ అవసరమని, ఆ సర్టిఫికెట్‌లో క్యూఆర్ కోడ్ స్పష్టంగా ఉండాలి. తండ్రి ఆధార్ కార్డులో ఉన్న ఆడ్రస్ బర్త్ సర్టిఫికెట్‌లో ఉండాలి. అలాగే తండ్రి ఆధార్‌లో కూడా కొత్తగా ఏర్పడ్డ జిల్లాలు, రాష్ట్రం అప్‌డేట్ అయి ఉండాలి. అంటే ఆంధ్రప్రదేశ్ స్థానంలో తెలంగాణ అని ఉండాలని, లేకపోతే ముందుగా వారు ఆప్డెట్ చేసుకోవాలి

● పిల్లలకు పేరు, ఆడ్రస్ మార్పు కోసం స్కూల్ బోనాఫైడ్ సర్టిఫికెట్ ప్రకారం కావలనుకుంటే సంబంధిత మండలంలో నివాస సర్టిఫికెట్ తీసుకుని మీకు కావాల్సిన పేరు విధంగా తీసుకవచ్చి పేరు, ఆడ్రస్ మార్చుకోవచ్చు.

● డేట్ ఆఫ్ బర్త్ మార్పు కోసం బర్త్ సర్టిఫికేట్, ఎస్ఎస్‌సీ ఒరిజినల్ మెమో (18 ఏళ్లు పైబడిన వారికి) పెద్ద వాళ్లకు అయితే పాస్‌పోర్టు ఐడెంటిటీ ద్వారా కూడా మార్చుకోవచ్చు.

● వివాహం తర్వాత పేరు, ఆడ్రస్ మార్చుకోవాలనుకుంటే మ్యారెజ్ సర్టిఫికెట్ లేదా మండలంలో రెసిడెన్షియల్ సర్టిఫికెట్ ద్వారా మార్చుకోవచ్చు.

● పేరు మార్పు కోసం పాన్ కార్డు, ఓటర్ ఐడి, లేటేస్ట్ బ్యాంకు పాస్ బుక్, ఎస్ఎస్‌సీ మెమో, పాస్‌పోర్టు ద్వారా కూడా మార్చుకోచ్చు.

● ఆధార్ కార్డులో ఆంధ్రప్రదేశ్‌కు బదులుగా తెలంగాణ అని మార్చుకోవాలంటే లేటెస్ట్ రెసిడెన్షియల్ సర్టిఫికేట్, బ్యాంకు పాస్‌బుక్ ద్వారా అప్డేట్ చేసుకోవచ్చు. ఇలాంటివి మార్పుల కోసం పోస్టాఫీసులో సేవలను పొందాలి వారు సూచించారు. రైల్వే సేవలను కూడా ఇక్కడ పొందవచ్చన్నారు.

వెల్లివిరిసిన ఆధ్యాత్మికం



హత్నూర : దౌల్తాబాద్‌లో రేణుకా ఎల్లమ్మ తల్లి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

హత్నూర, మే 6 (ఆంధ్రజ్యోతి): మండలం పరిధి దౌల్తాబాద్‌లోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

● కొండాపూర్,మే6(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారేపల్లి లక్ష్మీనారాయణ అష్టమ బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మంగళవారం స్వామివారి కల్యాణం ఘనంగా జరిపించారు. వైకుంఠపురం ప్రధాన అర్చకుడు కందాడై వరదాచార్యుల పర్యవేక్షణలో వేదపండితులు జరిపించారు. యజ్ఞం, యాగాలు, హోమాలు నిర్వహించారు. అలయ ప్రాంగణంలో చిన్నారుల భరతనాట్యం ఆకట్టుకున్నది. ఎమెల్యే చింతా ప్రభాకర్, తనయుడు సాయికుమార్ పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

● రేగోడు మే6(ఆంధ్రజ్యోతి): తెలంగాణలోనే ప్రసిద్ది చెందిన రేగోడు పోతులూరి వీర బ్రహ్మంగారి మఠంలో ఆరాధన ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం బ్రహ్మంగారి, శరబాక లింగమయ్య మఠం వద్ద ఫలహార బండ్ల ప్రదర్శన వైభవంగా జరిగింది. ప్రతేక హోమాలు నిర్వహించారు. బ్రహ్మంగారి, దుర్గమ్మ దేవి వీధి నాటకాలు నిర్వహించారు.




రేగోడు బ్రహ్మంగారిమఠం వద్ద బండ్ల ప్రదర్శన



కొండాపూర్ : లక్ష్మీనారాయణుడి కల్యాణాన్ని జరిపిస్తున్న వేదపండితులు

11 నుంచి భూలక్ష్మమ్మ జాతర



నారాయణఖేడ్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఒడెనక బండి కట్టి భూలక్ష్మమ్మ జాతరకు పదండి అంటూ పాటలు పాడి పరవశించే తుర్కపల్లి భూలక్ష్మమ్మ జాతర ఉత్సవాలు ఈ నెల 11 ఆదివారం నుంచి నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. 11న ఉదయం మహాలక్ష్మీదేవిపూజ, నైవేద్యాల సమర్పణ, సాయంత్రం 4 గంటలకు బండ్ల ఊరేగింపు, రాత్రి బోనాల ఊరేగింపు, భజనలు, కీర్తనలు ఉంటాయి. సోమవారం పాచిబండ్ల ప్రదర్శన, ఊరేగింపు, కుస్తీపోటీలు నిర్వహించనున్నారు. కామారెడ్డి జిల్లా ధర్మారంకు చెందిన బండ్లు కూడా ఈ జాతర ప్రదర్శనలో పాల్గొనడం విశేషం. తుర్కపల్లిలో దాదాపు 500 సంవత్సరాల క్రితం స్వయంభువుగా అమ్మవారు వెలిసినట్లు పూర్వీకుల ద్వారా తెలుస్తుంది. ఉత్సవాలను పురస్కరించుకొని భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఓ వైపు వృథా.. మరోవైపు వ్యథ



బర్దీపూర్ శివారులో వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీళ్లు



గినియార్‌పల్లిలో తాగునీటి కోసం చేతిపంపులకు మరమ్మతు చేయిస్తున్న అధికారులు

అసలే ఎండాకాలం.. భూగర్భ జలాలు తగ్గి తాగునీటి కోసం ప్రజలు అల్లాడుతుంటే సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దీపూర్ గ్రామ శివారులో మిషన్ భగీరథ పైపులైన్ ద్వారా నీరు వృథాగా పోతున్నది. సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే కారణమని ప్రజలు మండిపడుతున్నారు. నీటి వృథాను అరిట్టాలని ప్రజలు కోరుతున్నారు.

- ఝరాసంగం, (ఆంధ్రజ్యోతి)

మందుబాబులకు అడ్డాగా..



వట్‌పల్లి ఏఎంసీ యార్డులో దర్శనమిస్తున్న మద్యం సీసాలు

సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు మందుబాబులకు అడ్డాగా మారింది. రాత్రివేళల్లో కొందరు మద్యం సేవించి సీసాలు ఎక్కడపడితే అక్కడ పడేస్తున్నారు. దీంతో ఉదయం యార్డుకు వచ్చే కూలీలు, హమాలీలు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు విచారించి మందుబాబులపై చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

- వట్‌పల్లి, (ఆంధ్రజ్యోతి)

ప్రమాదకరంగా కల్వర్టు



ప్రమాదకరంగా ఉన్న పీచేర్యాగడి గ్రామంలోని కల్వర్టు

కోహీర్ మండలంలోని పీచేర్యాగడి గ్రామంలో ప్రధాన రహదారిపై ఉన్న ఓ కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. ఈ కల్వర్టు నిర్మించి చాలారోజులు కావడంతో శిథిలావస్థకు చేరింది. కల్వర్టు ఓవైపు పూర్తి కూలుతుండడంతో చాలామంది ప్రయాణికులు దానిపైనుంచి వెళ్లేందుకు భయపడుతున్నారు. పంచాయతీరాజ్ అధికారులు స్పందించి కల్వర్టును బాగు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

- కోహీర్, (ఆంధ్రజ్యోతి)

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చిన్నశంకరంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : 133 కేవీ మెదక్ ఎస్ఎస్‌లో, చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని 33 కేవీ ఫీడర్ మరమ్మతుల్లో భాగంగా చిన్నశంకరంపేట పరిధిలోని మాందాపూర్ సబ్‌స్టేషన్ల పరిధి, కొర్విపల్లితండా, గజగట్లపల్లి గ్రామాల్లోని బుధవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నామని మెదక్ విద్యుత్‌శాఖ ఏడీఈ మోహన్ బాబు, ఏఈ దినాకర్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. ప్రజలు విద్యుత్‌శాఖ అధికారులకు సహకరించాలని కోరారు.

●మెదక్ అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి): సమ్మర్ యాక్షన్‌ప్లాన్‌లో భాగంగా చేపడుతున్న పనుల కోసం బుధవారం మండల పరిధిలోని ఎస్ఎస్ఎఫ్, ర్యాలమడుగు, మక్తభూపతిపూర్, పాతూర్ సబ్ స్టేషన్ల పరిధిలో ఉదయం 8 నుంచి 2 గంట వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు.

జిల్లా ఆహార కల్తీ నియంత్రణ అధికారిగా శ్రీషికా

సంగారెడ్డి అర్బన్: సంగారెడ్డి జిల్లా ఆహార కల్తీ నియంత్రణ అధికారిగా(జీఎఫ్ ఐ-గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్) శ్రీషికా నియమితులయ్యారు. ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హోదాలో టాస్క్‌ఫోర్స్ స్క్వార్డ్ విధుల్లో ఉన్న ఆమెకు జీఎఫ్‌గా పదోన్నతి రావడంతో జిల్లా అధికారిగా నియామకం అయ్యారు.

91వ రోజుకు దీక్షలు

గుమ్మడిదల, మే 6 (ఆంధ్రజ్యోతి) : నల్లవల్లి గ్రామపంచాయతీ పరిధిలోని ప్యారానగర్‌లో డంపింగ్‌యార్డు నిర్మించొద్దంటూ జేఏసీ నాయకులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 91వ రోజుకు చేరుకున్నాయి. మూడునెలలుగా డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నిరసనలు చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఖేడ్‌లో చెరువు నిర్మించాలి

నారాయణఖేడ్, మే 6 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో చెరువును నిర్మించాలని తెలంగాణ ఐకాస జిల్లా చైర్మన్ ఖాజామియా అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఒక్క చెరువు, కుంట సైతం లేదన్నారు. ఎంపీ సురేష్‌షెట్కార్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి చర్యలు తీసుకోవాలని కోరారు.

గుర్తింపు కార్డులతో రైతులకు ప్రయోజనం

జహీరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి) : రైతుల ప్రయోజనార్థం కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న రైతుల గుర్తింపు ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి లావణ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని రంజోల్ గల రైతువేదికలో రైతులతో సమావేశం నిర్వహించారు.

'రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం'

మెదక్ మున్సిపాలిటీ, మే 6 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం కొట్టుమిట్టాడుతోందని.. ముఖ్యమంత్రి మాటలతో అటు ప్రజలు, ఇటు ఉద్యోగులు అయోమయంలో పడ్డారని బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు విమర్శించారు. పాలన చేతగాని ముఖ్యమంత్రి రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందని చెప్పడం విడ్డూరంగా ఉందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రాజీవ్ యువ వికాసంపై విచారణ

నారాయణఖేడ్/తూప్రాన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ యువ వికాసం పథకంపై నిజాంపేట్ మండల కేంద్రంతో పాటు నాగ్‌ధర్ గ్రామాల్లో నిజాంపేట్ ఎంపీడీవో సంగ్రాం ఆధ్వర్యంలో మండల టీం సభ్యులు విచారణ చేపట్టారు. దరఖాస్తుదారుడితో ఆయా అంశాలకు సంబంధించి వివరాలు సేకరించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హార్డ్ కాపీలను వెంటనే కార్యాలయంలో అప్పగించాలని ఎంపీడీవో శేషాద్రి కోరారు. ఆయన మాట్లాడుతూ రాజీవ్ యువ వికాసం పథకానికి 585 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

నెలలోగా భూ సమస్యలు పరిష్కారం

● సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి

కొండాపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి) : కొండాపూర్ మండలంలోని భూ సమస్యలు నెలరోజులలోపు తీరుతాయని సంగారెడ్డి ఆర్డీవో రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గిర్మాపూర్,గారకుర్తి రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సులను ఆయన పరిశీలించి మాట్లాడారు. రెవెన్యూలో కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల తప్పుల పరిష్కారానికే ప్రభుత్వం భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొచ్చిందని చెప్పారు. ఈ సదస్సులో ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, తహసీల్దార్లు బీ.అశోక్, రవీందర్, డీటీ ప్రదీప్, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.



రెవెన్యూ సదస్సులో అర్జీదారుడి దరఖాస్తు వివరాలను తెలుసుకుంటున్న ఆర్డీవో రవీందర్‌రెడ్డి

సబ్ రిజిస్ట్రార్‌పై దాడి హేయమైన చర్య

● నల్లబ్యాడ్జీలతో సంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ ఉద్యోగుల నిరసన

కంది, మే 6 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని పెద్ద అంబర్‌పేట సబ్ రిజిస్ట్రార్ రవీందర్‌పై అమానుషంగా దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలోని ఉద్యోగులు మంగళవారం ఆందోళన చేశారు. రవీందర్‌పై శ్రీనివాస్ అనే వ్యక్తి సోమవారం దాడిచేసిన సంగతి తెలిసిందే. దీంతో ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో పని చేస్తున్న ప్రతీ ఉద్యోగి ఉదయం నుంచి సాయంత్రం వరకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంగారెడ్డి సబ్ రిజిస్ట్రార్ విష్ణువర్ధన్, పటాన్‌చెరు సబ్ రిజిస్ట్రార్ అఫ్జల్ ఆజాంలు మాట్లాడుతూ సబ్ రిజిస్ట్రార్‌పై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ ఉద్యోగులు శేఖర్‌రెడ్డి, మాణిక్యం, లక్ష్మణ్, విక్రమ్, నవీన్, అంజన్న తదితరులు పాల్గొన్నారు.



సంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి

● మెదక్ డీఈవో రాధాకిషన్

చేగుంట/రామాయంపేట/మాసాయిపేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : విద్యా ప్రమాణాలను మెరుగుపరచుకోవడానికి సమ్మర్ క్యాంపులు దోహదపడతాయని మెదక్ జిల్లా విద్యాధికారి డాక్టర్ రాధాకిషన్ అన్నారు. చేగుంట మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును మంగళవారం ఆయన తనిఖీ చేసి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న క్యాంపులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెదక్ జిల్లాలోని 21 మండలాల్లో ఈ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం చేగుంట పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును ఆకస్మికంగా సందర్శించారు. ఈ సమయంలో ప్రధానోపాధ్యాయుడు అందుబాటులో లేకపోవడంతో డీఈవో ఫోన్‌లో మాట్లాడారు. రామాయంపేటలోని బాలికల హైస్కూల్‌లో నడుస్తున్న వేసవి శిక్షణా శిబిరాలను డీఈవో రాధాకిషన్ సందర్శించారు. మాసాయిపేట మండలంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును ఎంఈవో లీలావతి మంగళవారం పరిశీలించారు.



చేగుంట పాఠశాలలో సమ్మర్ క్యాంపును సందర్శించిన రాధాకిషన్

మెరుగైన వైద్యసేవలందిస్తాం: ఎమ్మెల్యే



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పటాన్‌చెరు, మే 6 (ఆంధ్రజ్యోతి) : పటాన్‌చెరు పారిశ్రామికవాడలో మెరుగైన వైద్య సేవలందించేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్‌చెరులో వంద పడకల ఏరియా ఆస్పత్రిలో రూ.70 లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఏరియా ఆసుపత్రిలో ఓపీ సేవలు రికార్డు స్థాయిలో పెరగడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విజయ్‌కుమార్, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే నియోజకవర్గంలోని పలు మున్సిపాలిటీలు, జీహెచ్ఎంసీ డివిజన్లు, గ్రామాలకు చెందిన 101 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.46 లక్షల చెక్కులను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, పుష్పానగేష్‌యాదవ్, మాజీ ఎంపీపీలు పాల్గొన్నారు.

కోర్టు ఏర్పాటుకు భవనం పరిశీలన

తూప్రాన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ పట్టణంలో కోర్టు ఏర్పాటుకు భవనాన్ని అదనపు కలెక్టర్, డీఆర్వో భుజంగరావు పరిశీలించారు. మంగళవారం తూప్రాన్ మండల పరిషత్ కార్యాలయానికి విచ్చేసి ఆర్డీవో జయచంద్రారెడ్డితో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయాన్ని ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లోకి తరలించి, మండల పరిషత్ కార్యాలయంలో కోర్టు ఏర్పాటుకు నిర్ణయించారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను మండల పరిషత్ కార్యాలయానికి అనుకూలంగా మార్చేందుకు ప్రతిపాదనలు చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో శేషాద్రి, తహసీల్దార్ టెక్మాల్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

'వెల్‌నెస్'లో డిప్యూటీ ఈవో తనిఖీలు



తనిఖీలు నిర్వహిస్తున్న చంద్రశేఖర్

సంగారెడ్డి అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని వెల్‌నెస్ సెంటర్‌ను ఈజేహెచ్ఎస్(ఎంప్లాయీస్ అండ్ జర్నలిస్టు హెల్త్ స్కీమ్) డిప్యూటీ ఈవో (అడ్మిన్) జె.చంద్రశేఖర్ మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వెల్‌నెస్‌లో మందులు కొరత, రెగ్యులర్ డాక్టర్లు లేకపోవడం, ఇతరత్ర సమస్యలు తరచూ ఉత్పన్నమౌతున్న తరుణంలో దిద్దుబాటు చర్యల్లో భాగంగా ఆయన సందర్శించారు. వెల్‌నెస్ సెంటర్‌లోని రికార్డులు, ఫార్మసీ మందులు, స్టాక్ వివరాలు, సిబ్బంది విధులపై ఆరా తీశారు. పేషెంట్లతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వెల్‌నెస్‌లో నెలకొన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కారిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆయన వెంట ఆరోగ్యశ్రీ డిస్ట్రిక్ట్ మేనేజర్ జి.విజయభాస్కర్, వెల్‌నెస్ సిబ్బంది ఉన్నారు.

'మదర్సాలపై విచారణ జరిపించండి'

మెదక్ అర్బన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : మెదక్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న మదర్సాలపై విచారణ జరిపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు మల్లేశంగౌడ్ కలెక్టర్, ఎస్పీలను మంగళవారం కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పలుచోట్ల నిర్వహిస్తున్న మదర్సా, పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, విద్యార్థులు భారతీయుల లేక పాకిస్తాన్ నుంచి వచ్చి ఆశ్రయం పొందుతున్నారా.. వారి వివరాలతో పాటు జాబితాను వెల్లడించాలన్నారు. అనంతరం కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

తూప్రాన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ పేర్కొన్నారు. మంగళవారం తూప్రాన్ మండలం యావాపూర్ శివారులో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి అధ్యక్షతన తూప్రాన్, మనోహరాబాద్ మండలాల సంస్థాగత ఎన్నికల సమావేశం నిర్వహించారు. జిల్లా పరిశీలకులు మెట్టు సాయికుమార్, వరప్రసాద్ హాజరై ప్రసంగించారు. కాంగ్రెస్‌కు కార్యకర్తలు ముఖ్యమని పేర్కొన్నారు. టీపీసీసీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఆదేశాల మేరకు సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయంపైనే గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ ఆధారపడి ఉందన్నారు. తూప్రాన్ పట్టణ అధ్యక్షుడు పల్లెర్ల రవీందర్‌గుప్తా ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ గంగుమల్ల ఎలక్షన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కొక్కొండ నర్సింహారెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శ్రీనివాస్, గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగుపై రైతులు శ్రద్ధ చూపాలి

గుమ్మడిదల, మే 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు చిరుధాన్యాల సాగుపై శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని తెలంగాణ వ్యవసాయ కమిషన్ మెంబర్ రాములునాయక్ పేర్కొన్నారు. మంగళవారం గుమ్మడిదల మండలం అన్నారం గ్రామంలో వ్యవసాయ శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం రాజేంద్రనగర్ వారి ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమం పురపాలక వార్డు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాములునాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు లాభదాయకంగా ఉండే పంటలు సాగుచేసేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో అసోసియేట్ ప్రొఫెసర్ డా.కే.సుమాలిని పాల్గొన్నారు.

'ఉపాధిహామీ'ని నిర్వీర్యం చేసిన కేంద్రం

జహీరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసి, రైతు కూలీల ఉసురు పోసుకుంటుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాంచందర్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన కార్మిక సంఘం సమావేశంలో మాట్లాడారు. ఉపాధిహామీ పథకానికి రూ.2 లక్షల కోట్లు కేటాయించాలన్నారు. ఉపాధిహామీ పథకంలో పనిచేసే కూలీలకు రోజు రూ.600 ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశాల్లో ప్రమాదాలు జరిగితే రూ.10 లక్షల ప్రమాదభీమాను ఇవ్వాలని, ఏడాదికి ప్రతిఒక్కరికి 200 పనిదినాలు కల్పించాలని ఆయన కోరారు.

'అక్రమాలను వెలికితీసేందుకు మానవ హక్కుల సంఘం కృషి'

జహీరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి) : అవినీతి, అక్రమాలను వెలికితీసేందుకే మానవ హక్కుల సంఘం నిరంతరం కృషి చేస్తున్నదని ఆ సంఘం జిల్లా చైర్మన్ వినయ్‌పవార్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని అతిథి-ఇన్‌లో మానవ హక్కుల సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ మానవ హక్కుల సంఘం పనిచేసే తీరు గురించి వివరించారు. ప్రజలపక్షాన పోరాటాలు చేస్తూ అవినీతి, అక్రమాలను వెలికితేసేందుకు సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. ఇందులో భాగంగా జహీరాబాద్ మండల చైర్మన్‌గా రంజోల్‌కు చెందిన సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకుని నియమాకపత్రం అందజేశారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

వెల్దుర్తి/గుమ్మడిదల/పెద్దశంకరంపేట/రామాయంపేట/వెల్దుర్తి/చేగుంట, మే 6 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని హస్తాల్‌పూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి, రైతులతో మాట్లాడారు. ఆయన వెంట తహసీల్దార్ బాలలక్ష్మి, వ్యవసాయ శాఖ ఏవో ఝాన్సీ, ఆర్ఐ నర్సింగ్ యాదవ్ ఉన్నారు. గుమ్మడిదల మండలంలోని కొత్తపల్లి, కానుకుంటలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాలను డీఆర్డీఏ డీపీఎం జయశ్రీ పరిశీలించారు. పెద్దశంకరంపేట మండల పరిధిలోని సబ్ మార్కెట్‌యార్డులో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. రామాయంపేట మండల పరిధిలో సుతార్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తహసీల్దార్ రజని పరిశీలించారు. అకాల వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి గౌరి వ్యవసాయ శాఖ ఏఈవో వందనకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. చేగుంట మండలంలోని వడియారం గ్రామంలో ఐకేపీ, సొసైటీ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను డీఆర్వో భుజంగరావు పరిశీలించారు.



వెల్దుర్తి : హస్తాల్‌పూర్‌లో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో జయచంద్రారెడ్డి

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జహీరాబాద్, మే 6 (ఆంధ్రజ్యోతి) : కక్షిదారుల ప్రయోజనార్థం కోర్టు ఆధ్వర్యంలో నిర్వహించే లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ జి.కవితాదేవి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జూన్ 14న లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

సంగారెడ్డి రూరల్, మే 6 (ఆంధ్రజ్యోతి) : పిల్లలు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సౌజన్య అన్నారు. సంగారెడ్డిలోని బాలసదనంలో మంగళవారం పిల్లలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బాలసదనంలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

సమస్యలపై ఫిర్యాదు చేయండి: కార్పొరేటర్

రామచంద్రాపురం టౌన్, మే 6 (ఆంధ్రజ్యోతి) : కాలనీల్లో సమస్యలపై నిత్యం పర్యవేక్షణ జరుపుతున్నామని కార్పొరేటర్ పుష్పానగేష్ అన్నారు. మంగళవారం రామచంద్రాపురం డివిజన్ పరిధి మయూరినగర్ కాలనీలో బస్తీదర్శన్‌లో భాగంగా 'మార్నింగ్‌వాక్ విత్ అఫీషియల్స్' కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి అన్నిశాఖల అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. స్థానికుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆమెవెంట ఉపకమిషనర్ సురేష్, ఆరోగ్యశాఖ అధికారి విజయమోహన్, రాజుగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

'అక్రమంగా నివసిస్తున్న వారిని పంపించాలి'

సంగారెడ్డి క్రైం/నిజాంపేట/శివ్వంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అక్రమంగా నివసిస్తున్న పాకిస్తానీయులు, బంగ్లాదేశీ, రోహింగ్యాలను గుర్తించాలని జనజాగరణ సమితి నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సంగారెడ్డి ఎస్పీ పరితోష్ పంకజ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందులో సమితి ఉపాధ్యక్షుడు శివశంకర్ పాటిల్, ప్రధాన కార్యదర్శి సాయికిరణ్, నాయకులు విష్ణు, శివసాయి, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. అక్రమ వలసదారులను ప్రభుత్వం స్వదేశాలకు పంపించాలని బీజేపీ జిల్లా కార్యదర్శి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం పోలీస్‌స్టేషన్, తహసీల్దార్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. శివ్వంపేట మండలంలో పాకిస్తాన్ ఉగ్రవాదుల ఏజెంట్లను గుర్తించి స్వదేశానికి పంపించాలని బీజేపీ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ షఫియోద్దీన్‌కు, పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ వెంకట్‌స్వామికి వినతిపత్రం అందజేశారు.


దుర్గామాత దర్శించుకున్న సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్

కోహీర్, మే 6 (ఆంధ్రజ్యోతి) : కోహీర్ మండలం చింతలఘట్టు గ్రామంలో కొనసాగుతున్న దుర్గామాత, ఊరడమ్మ దేవతల విగ్రహాల ప్రతిష్ఠాపనలో రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్.గిరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉజ్వల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం వారిని గ్రామస్థులు సన్మానించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పట్లోల్ల రామలింగారెడ్డి, సీడీసీ చైర్మన్ ముబీన్ పాల్గొన్నారు.

'సేంద్రియ ఎరువులు వాడాలి'

నర్సాపూర్, మే 6 (ఆంధ్రజ్యోతి) : రైతులు రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువులను వాడాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. మంగళవారం నర్సాపూర్ మండలం కొండాపూర్, మహ్మదాబాద్ గ్రామాల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వ్యవవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు గీత, రంజిత, గాయత్రి పాల్గొని ఎరువుల యాజమాన్యం, యూరియా వాడకం తగ్గించడం, మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాలను వివరించారు.

ఘనంగా వెంకట్రాంరెడ్డి జన్మదిన వేడుకలు



వెంకట్రాంరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

శివ్వంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : పేదల కోసం పనిచేసే నాయకుడికే ప్రజల ఆశీస్సులు ఉంటాయని పీసీసీ కార్యదర్శి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి అన్నారు. మంగళవారం పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రాంరెడ్డి 58వ జన్మదిన వేడుకలను మండల పరిధిలోని కొంతంపల్లి శివారులోని వనం రిసార్ట్స్‌లో అభిమానులు, కాంగ్రెస్ నాయకుల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 1000 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అనంతరం వెంకట్రాంరెడ్డి అభిమానులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్, సీఈవో మధుయాదవ్, అభిమానులు, కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రామాయంపేటలో పోలీసుల కవాతు

రామాయంపేట, మే 6 (ఆంధ్రజ్యోతి) : రామాయంపేటలో స్పెషల్ పోలీసులు కవాతు నిర్వహించాయి. మంగళవారం సాయంత్రం పోలీస్‌స్టేషన్ నుంచి ప్రత్యేక బలగాలు ర్యాలీగా కదిలాయి. పోలీసులు ప్రజలకు అండగా మేమున్నామంటూ ధీమా కల్పించే లక్ష్యంగా కవాతు చేపట్టారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు